క్లుప్తంగా

శిక్షణతో పరిశోధనలకు మార్గం



సదస్సులో పాల్గొన్న కళాశాల శిక్షణ సిబ్బంది

గండేపల్లి: భవిష్యత్ పరిశోధనలకు శిక్షణే సరైన మార్గదర్శకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఆఫ్ క్వాంటమ్ మెషిన్ లెర్నింగ్ అనే అంశంపై ఐదు రోజుల పాటు జరగనున్న సదస్సును మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు క్వాంటమ్ కంప్యూటింగ్, మెషిన్ లెర్నింగ్, డేటా ప్రాసెసింగ్ క్వాంటమ్ ఆల్గోరిథమ్స్, తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎంబి శ్రీనివాస్, జి సంజీవ్‌రావు, వైస్ ప్రో.ఛాన్సలర్ ఎస్ రమాశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

హైవే వెంబడి అప్రమత్తంగా ఉండాలి



చేపూరులో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రూరల్ సీఐ చెన్నకేశవరావు

తుని రూరల్: జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.చెన్నకేశవరావు అన్నారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాలతో మంగళవారం తుని మండలం చేపూరు గ్రామంలో రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారి అధ్యక్షతన నేరాలు నివారణపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐ మాట్లాడుతూ హైవే వెంబడి ఆనుకుని ఉన్న గ్రామస్తులు రోడ్డు ప్రమాదాలకు, దొంగతనాలకు, దోపిడిలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని, అప్రమత్తంగా వ్యవహరించడంతో కొంతవరకు నివారించుకోవచ్చన్నారు. యువత సైబర్ నేరాలు, డ్రగ్స్, నిషేధిత జూదాలు జోలికి వెళ్లొద్దన్నారు. గ్రామంలో జూదాలు, కొత్త వ్యక్తులు సంచరిస్తే అటువంటి వారి సమాచారాన్ని తమకు అందజేయాలన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి ఆర్థిక సాయం



విద్యార్థిని తాటిపాక ప్రవల్లికకు రూ.ఐదువేలు నగదు అందచేస్తున్న మురళీ కృష్ణంరాజు

అన్నవరం: అనారోగ్యం పాలై చికిత్స పొందుతున్న స్థానిక వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలు పోతాప్రగడ రాకేష్, కొల్లు సత్తిబాబులను ఆ పార్టీ నాయకుడు, నర్సాపురం లోక్‌సభ నియోజకవర్గ పరిశీలకుడు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజు మంగళవారం పరామర్శించి తన ఉదారతను చాటుకున్నారు. బాధితులు ఇద్దరికి రూ.ఐదు వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందచేశారు. వైద్యానికి అవసరమైన సహాయ సహకారాలు అందచేస్తానని వారి కుటుంబాలకు హామీ ఇచ్చారు.

విద్యార్థినికి చేయూత

పదో తరగతి పరీక్షల్లో 560 మార్కులు సాధించి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా షైనింగ్ స్టార్ అవార్డు పొందిన స్థానిక శ్రీ సత్య సాయి విద్యార్థిని తాటిపాక ప్రవల్లికకు రూ.ఐదువేలు నగదు బహుమతిని ముదునూరి అందచేసి ఆశీర్వదించారు. ప్రవల్లికను ఉన్నత చదువులు చదివించాలని అందుకు అవసరమైన సహాయ సహకారాలు తాను అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ముదునూరి వెంట స్థానిక ఎంపీటీసీ దడాల సతీష్, ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు, పార్టీ నాయకులు కొండపల్లి అప్పారావు, తాటిపాక కృష్ణ, ఈగల రాఘవ, మాజీ ఉపసర్పంచ్ కొల్లుబోయిన సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం అందించాలి

గోకవరం: టీబీ వ్యాధిపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ నిఖిత అన్నారు. మండలంలోని మల్లవరం గ్రామంలో మంగళవారం ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వ్యాధి అంతానికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. గ్రామాల్లో డయాబెటిక్, పొగాకు ఉత్పత్తుల వాడే వారికి, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి, 60 సంవత్సరాలు పైబడిన వారు, పాత రోగులకు క్లై పరీక్షలు, ఎక్స్‌రేలు తీసి వ్యాధి నిర్ధారణకు చర్యలు చేపడుతున్నామన్నారు. దగ్గు లక్షణాలతో బాధపడుతున్న వారు పరీక్షలు చేయించుకోవాలన్నారు. అవకాశం ఉన్న వారు నిక్షయ్‌మిత్రగా చేరి వ్యాధిగ్రస్తులకు పోషకాహారం అందించాలని పిలుపునిచ్చారు. ఎస్‌టిఎస్ శ్రీనివాస్, ఎమ్.ఎల్.హెచ్. పి.మాలతి, దినేష్, హెల్త్ అసిస్టెంట్లు ఏ.ఎన్.ఎమ్‌లు పాల్గొన్నారు.

పత్రికాస్వేచ్ఛను హరిస్తున్న కూటమి



ఏలేశ్వరంలో ఎస్సైకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు



కిర్లంపూడి స్టేషన్‌లో ఎస్సై జి.సతీష్‌కు వినతిపత్రం అందజేస్తున్న విలేకర్లు



జగ్గంపేటలో ఎస్సై రఘునాథరావుకు వినతిపత్రం సమర్పిస్తున్న జర్నలిస్టులు



ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావుకు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

ఏలేశ్వరం: రాష్ట్రవ్యాప్తంగా సాక్షి కార్యాలయాలపై ప్రభుత్వ దాడులకు నిరసనగా జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తంచేశారు. జర్నలిస్టులపై, పత్రికాస్వేచ్ఛను హరించడంపై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రామలింగేశ్వరరావుకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాక్షి టీవీలో లైవ్ ప్రోగ్రాంలో మాటలకు వక్రీకరించి సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడం దారుణమన్నారు. సీఎం చంద్రబాబు ప్రభుత్వం కావాలనే సాక్షిపై కక్ష కట్టిందని ఆరోపించారు. రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛ భంగం కలిగించడం దారుణమన్నారు. దాడులకు పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జర్నలిస్టులు కోరాడ శ్రీనివాసరావు, దొంతంశెట్టి సతీష్, పారేపల్లి గంగాప్రసాద్, గ్రంధిస్వామి తదితరులు పాల్గొన్నారు.

పత్రిక కార్యాలయంపై దాడులు సరికావు

కిర్లంపూడి: సాక్షి కార్యాలయాలపై దాడులకు పాల్పడడం సరికాదని ది.కిర్లంపూడి ప్రెస్‌క్లబ్ సభ్యులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా స్థానిక రిపోర్టర్లు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ అత్యంత కీలకమైందని అటువంటి వ్యవస్థను నిర్వీర్యం చేయాలనే ఆలోచన సరైంది కాదన్నారు. సాక్షి కార్యాలయాలపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సై జి.సతీష్‌కు వినతి పత్రం అందజేశారు. పెంటకోట సాయిబాబు, ఉడతా అప్పారావు, బొండా కృష్ణ, శకరణం కృష్ణ, మూరా చంటిబాబు, చెప్పుల రాంబాబు, ఆడారి గంగబాబు, అడారి సురేంద్ర, జగన్, మొల్లేటి సాంబశివ తదితరులు ఉన్నారు.

పత్రికా స్వేచ్ఛకు ఆటంకాలు

జగ్గంపేట: పత్రికా కార్యాలయాలపై దాడులు చేయడం తగదని, ఇది పత్రికా స్వేచ్ఛకు ఆటంకం కలిగిచడమేనని జగ్గంపేటలో పలువురు జర్నలిస్టులు నిరశన తెలిపారు. సాక్షి కార్యాలయంపై దాడులు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం ఏపీయూడబ్ల్యూజె జిల్లా సహాయ కార్యదర్శి సుంకర శ్రీనివాస్ ఖండించారు. పత్రికా కార్యాలయాలపై దాడులు చేసేవారిపై చర్యలు తీసుకోవాలని, పత్రికా స్వేచ్ఛను కాపాడాలని కోరతూ జగ్గంపేట ఎస్సై రఘునాధరావుకు జగ్గంపేట, గండేపల్లికి చెందిన జర్నలిస్టులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట సాక్షి రిపోర్టర్ కుమార్, గండేపల్లి సాక్షి రిపోర్టర్ శ్రీధర్, రిపోర్టర్లు అడపాశ్రీను, కడిలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు అరికట్టాలి

ప్రత్తిపాడు: రాష్ట్రంలో సాక్షి కార్యాలయాలపై టీడీపీ నేతల దాడిని నిరసిస్తూ మంగళవారం ప్రత్తిపాడు సర్కిల్ ఇనస్పెక్టర్ కార్యాలయం వద్ద పాత్రికేయులు శాంతియుత నిరసన చేపట్టారు. సాక్షి పత్రికలో తమపై వ్యతిరేకంగా వార్త ప్రచురితమైందనే కక్షతో కూటమి ప్రభుత్వ హాయాంలో పత్రికలపై దాడులకు పాల్పడడం, ఫర్నీచర్ తదితర సామాగ్రిని ధ్వంసం చేయడం దారుణమని పాత్రికేయులు అన్నారు. జర్నలిస్టులపై దాడులు అరికట్టాలని, కోరుతూ ప్రత్తిపాడు సీఐ సూర్యఅప్పారావు, ఎస్సై లక్ష్మీకాంతంకు పాత్రికేయులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పాత్రికేయులు ఎస్వీ సోమేశ్వరరావు, ప్రగడ రామకృష్ణ, పి శ్రీనివాసు (వాసు), బి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సత్తిబాబు

ఏలేశ్వరం: మండల పరిధిలోని యర్రవరం జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. స్థానిక పోలీసుల వివరాల ప్రకారం మండలంలోని చిన్నింపేట గ్రామానికి చెందిన రఘుమండ సత్తిబాబు(32) యర్రవరం గ్రామంలోని సీపీఎఫ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. విధులు నిర్వహణకై యథావిథిగా సైకిల్‌పై కంపెనీకి వెళ్తొండగా రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. దీంతో సత్తిబాబుకు తీవ్రగాయాలు కాగా ప్రత్యేక వాహనంలో చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడుకి ఇంకా వివాహం కాలేదని తల్లి దండ్రులు అప్పలనాయుడు, రాజ్యలక్ష్మీ, సోదరుడు నాని ఉన్నారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కిశోర బాలికల సాధికారతే లక్ష్యం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీసీపీఓ శ్రీనివాసరావు

తుని రూరల్: కిశోర బాలికల సాధికారతే మనందరి లక్ష్యం కావాలని డిస్ట్రిక్ట్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం తుని, తొండంగి మండలాలు, తుని పట్టణంలో జరిగిన కిశోర బాలిక అవగాహన సదస్సులకు ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. తుని పట్టణం అమ్మాజీపేటలో సీడీపీఓ కె.శ్రీలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న డీసీపీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో కిశోర వికాసం కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమాల్లో వేలాది మంది బాలికలకు విద్య, వైద్యం, వ్యక్తిగత పరిశుభ్రత, పోషక ఆహారం, బాల్య వివాహాలు నిర్మూలన, రక్తహీనత, నైపుణ్యాభివృద్ధి, వృత్తి మార్గదర్శనం, ఆన్‌లైన్ భద్రత, సైబర్ నేరాలు, పొదుపు, ఆర్థిక నిర్వహణ, నాయకత్వ లక్షణాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించామన్నారు. బాలికలకు వివిధ ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందించామన్నారు. కిశోర బాలికల వేసవి కార్యక్రమాలు నేటితో ముగిశాయన్నారు. సూపర్‌వైజర్ సరస్వతీ, మహిళా పోలీస్ శ్రీకన్య, ఏఎన్‌ఎం సిరి, నాయకులు అల్లు రాజు, దండెం నాగు, ఎ.బాలాజీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

కండివాగుకు మోక్షమెప్పుడో..?

- దశాబ్దాలుగా రైతన్నల ఆవేదన
- ముంపునకు గురవుతున్న పంట పొలాలు
- సర్‌ప్లస్ వ్యాయర్ వద్ద లాకుల ఏర్పాటుకు విజ్ఞప్తులు
- కార్యరూపం దాల్చని ఐదు బ్రిడ్జిల నిర్మాణం



కండివాగు మదుం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు (ఫైల్)

కోటనందూరు: కొత్తకొట్టాం వద్ద కండివాగుపై బ్రిడ్జి నిర్మించినా మదుం వద్ద లాకులు ఏర్పాటు చేయని కారణంగా రైతులు ఇబ్బందులు యధావిధిగా కొనసాగుతున్నాయి. సర్‌ప్లస్ వ్యాయర్ (కండి వాగు మదుం) వద్ద లాకులు నిర్మించకపోతే రైతుల ఇబ్బందులు తొలగే పరిస్థితి లేదని వాపోతున్నారు. లాకులు నిర్మించాలని దశాబ్దాలుగా రైతులు చేస్తున్న విజ్ఞప్తిని ఎవరూ పట్టించుకోవడంలేదు. కండివాగు దిగువ ప్రాంతంలో ఉన్న బాడవగెడ్డ మట్టితో కూడుకుపోవడం, లాకులు లేని కారణంగా వరదలు, తుఫానుల సమయంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

మండలంలో పాతకొట్టాం, కొత్తకొట్టాం గ్రామాల మధ్య వరద నీరు దిగువకు పోయేందుకు కండివాగు ఉంది. ఈ వాగుపై ఉన్న వంతెన దిగువభాగంలో స్తంభాల మధ్య ఖాళీ తక్కువగా ఉండడంతో భారీ వర్షం పడిన ప్రతిసారి చుట్టు ప్రక్కల చెరువుల నుంచి వచ్చే వరద నీటితో కండివాగు పొంగడం, వందలాది ఎకరాలు నీట మునగడం, రైతులు పంటలు నష్టపోవడం అనేది సర్వసాధారణం. ఈ గెడ్డ కే.ఎ మల్లవరం వద్ద బాడవ గెడ్డగా మారి కేఓ అగ్రహారం వద్ద తాండవ నదిలో కలుస్తుంది. ఈ నేపధ్యంలో రైతుల విజ్ఞప్తి మేరకు పదేళ్ల క్రితం కండివాగుపై రూ.20 లక్షలతో పెద్ద బ్రిడ్జి నిర్మించారు. లక్షలు ఖర్చు చేసి బ్రిడ్జి నిర్మించినా రైతుల సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. బ్రిడ్జి నిర్మాణ సమయంలో రాకపోకలకు వీలుగా కండి వాగులో కాంట్రాక్టర్ మట్టిని వేశారు. వేసిన మట్టిని నిర్మాణం పూర్తయినా గాని తొలగించక పోవడం, గెడ్డలో భారీగా పూడిక పేరుకుపోవడంతో తుఫానుల సమయంలో ఆ ప్రాంతంలో ఉన్న పొలాలన్నీ యధావిధిగా ముంపునకు గురౌతున్నాయి.

లాకులు లేకపోవడమే అసలు సమస్య

ఈ వాగు కారణంగా సాగునీటి ప్రయోజనాల కంటే వరదనీటి ప్రమాదాలే ఎక్కువని అన్నదాత ఆవేదన చెందుతున్నాడు. కండివాగు సర్‌ప్లక్స్ వ్యాయర్ వద్ద పెద్ద మలుపు ఉండడంతో నీరు వెనుకకు ఎగతన్నడం, నది తరువాత వ్యాయర్ (బాడవ గెడ్డ) ఆక్రమణలకు గురి కావడం ఈ దుస్థితికి కారణంగా రైతులు ఆరోపిస్తున్నారు. బాడవ గెడ్డపై చోటు చేసుకున్న ఆక్రమణలు తొలగించి గెడ్డను వెడల్పు చేస్తేనే గాని కండివాగు క్రింద ముంపు సమస్య తీరదని రైతులు చెబుతున్నారు. లాకులు లేని కారణంగా వరద నీటిని అదుపు చేయడం వీలుపడటం లేదని రైతులు వివరించారు. ఈ గెడ్డ క్రింద సుమారుగా 600 ఎకరాల ఆయకట్టు ఉంది.

లాకులు ఏర్పాటు చేయాలి



కండివాగుపై బ్రిడ్జి వెడల్పుగా కట్టినప్పటికీ మదుం దగ్గర లాకులు లేకపోవడం, బాడవ గెడ్డ కుదించుకుపోవడం వల్ల వరద నీరు తొందరగా ప్రవహించడం లేదు. ఈ కారణంగా కండివాగు ముందు, వెనుక భాగంలో ఉన్న పొలాలు ముంపునకు గురవుతున్నాయి. బాడవ గెడ్డను వెడల్పు చేసి, కండివాగుపై లాకులు ఏర్పాటు చేస్తేనే ముంపుబారి నుంచి రైతులు బయట పడతారు. అధికారులు సమస్యను పరిష్కరించాలి.

చిటికెల బాపన్నదొర, రైతు, కొత్తకొట్టాం

రూ.85 లక్షలతో ప్రతిపాదనలు

కండివాగు అభివృద్ధి, లాకుల ఏర్పాటుకు రూ. 25 లక్షలతో, ఈ వాగుపై ఇవతలి గట్టు నుంచి అవతలి గట్టుకు వెళ్లేందుకు ఐదు బ్రిడ్జిల నిర్మాణానికి మరో రూ. 60 లక్షలతో అధికారులు గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అవి కార్యరూపం దాల్చకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుదీర్ఘ కాలంగా ఉన్న రైతుల డిమాండుకు పరిష్కరించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ముద్రగడ గిరిబాబు పరామర్శలు



ములగపూడిలో క్షతగాత్రులు మానెల్లి బుజ్జిని పరామర్శిస్తున్న ప్రత్తిపాడు ఇంచార్జి ముద్రగడ గిరిబాబు



గణేశ్‌ను పరామర్శిస్తున్న ముద్రగడ గిరిబాబు

రౌతులపూడి: ఇటీవల ములగపూడిలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ సానుభూతి పరులు, అభిమానులను వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పరామర్శించారు. గ్రామ ఈలవేల్పుగా కొలుస్తున్న వేములమ్మతల్లి అమ్మ వారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ప్రమాదవశాత్తు గాయపడి చికిత్సపొంది విశ్రాంతి తీసుకుంటున్న మానెల్లి బుజ్జి,మానెల్లి బాబులు, కాపారపు ఆనంద్ సామ్యూల్, కాపారపు రాజులను, పి.చామవరం గ్రామానికి చెందిన జి.రాజును మంగళవారం వారి స్వగృహాలకు వెళ్లి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారంతా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పాఠశాలలు ఏర్పాటు చేయటం ఆనందంగావుందన్నారు. ప్రతి ఒక్కరికి నాణ్యమైన విద్యను అందుబాటులో ఉండేలా చూడాలని పాఠశాల కరస్పాండెంట్‌ను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు వాసిరెడ్డి జమీలు, భాస్కరబాబు, మండల పార్టీ కన్వినర్ సీహెచ్‌వీవీ సత్యన్నారాయణ, పార్టీ బీసీ అధ్యక్షుడు సర్నం శ్రీను, అంకంరెడ్డి సతీష్‌కుమార్, రాపర్తి రామకృష్ణ, పులి మదు,కేదారిశెట్టి నాగేశ్వరరావు, పోలుపర్తి తాతాజీ,స పలవురు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముద్రగడ పరామర్శలు

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీ కార్యకర్త శరకణం సంతోష్ సోదరుడు గణేశ్‌కి ఇటీవల ప్రమాదవశాత్తు కాలికి గాయమైంది. దీంతో కుట్లు వేయగా ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్నాడు. మంగళవారం పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు బాలరాజుపేటలోని బాధితుడి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం జరిగిన సంఘటనపై అడిగి తెలుసుకుని విచారం వ్యక్తం చేశారు. ఆయన వెంట పెంటకోట నాగబాబు, పాముల చంటి, శరకణం తాతాజీ, పాముల వీరబాబు తదితరులు ఉన్నారు.

అన్నవరం దేవస్థానం సిబ్బంది బదిలీ

- అన్నవరం దేవస్థానం సిబ్బంది బదిలీ
- ఏఈఓ మొదలు క్రింది స్థాయి వరకు బదిలీలు

అన్నవరం: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలలో భాగంగా దేవాదాయశాఖకు చెందిన అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోనూ పలువురు సిబ్బందిని ఇతర దేవస్థానాలకు బదిలీలు అయ్యారు. ఈ మేరకు ఆలయ ఏఈఓ పాలంకి జగ్గారావును సింహాచలం దేవస్థానానికి, సూపరిండెంట్ వీ.సూర్యనారాయణ మూర్తిని విజయవాడ దుర్గగుడి దేవస్థానానికి, విజయవాడ దుర్గగుడిలో సూపరిండెంట్‌గా పనిచేస్తున్న తాడి గుర్రాజును అన్నవరం దేవస్థానానికి బదిలీలు చేశారు.

సీనియర్ అసిస్టెంట్‌లు ఏ.శ్రీనివాసరావును ద్వారకా తిరుమల దేవస్థానానికి, ఎం. శ్రీనివాసరావును విజయవాడ దేవస్థానాలకు, విజయవాడ దేవస్థానంలో పనిచేస్తున్న పప్పుల వేంకట రమణను అన్నవరం దేవస్థానానికి బదిలీలయ్యారు.

జూనియర్ అసిస్టెంట్లు కొంతం సతీష్‌ను అన్నవరం నుంచి విజయవాడ దేవస్థానానికి, బీ.పవన్ కుమార్‌ను ద్వారకాతిరుమల దేవస్థానానికి, కేహెచ్ ప్రసాద్‌ను ద్వారకా తిరుమల నుంచి అన్నవరం దేవస్థానానికి బదిలీ చేశారు.

డీఈ ఉదయ్ కుమార్ మళ్లీ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ

దేవాదాయశాఖ డీసీ (కాకినాడ) కార్యాలయం డీఈ ఉదయ్‌కుమార్ డిప్టేషన్‌పై గత రెండేళ్లుగా అన్నవరం దేవస్థానంలో సేవలందిస్తున్నారు. ఆయన డిప్టేషన్ పూర్తయినందున తిరిగి దేవాదాయశాఖ డీసీ కార్యాలయానికి బదిలీ చేశారు. దీంతో అన్నవరం దేవస్థానంలో ఒకే ఒక్క డీఈ పీ.గుర్రాజు మిగిలారు. డీఈ ఉదయ్ కుమార్ దేవస్థానంలో నూతన స్వర్ణ ధ్వజస్తంభం ప్రతిష్ఠ, నూతన రథాల నిర్మాణం, రావిచెట్టు వద్ద భక్తులు దీపాలు వెలిగించుకునేందుకు వీలుగా చెట్టుకు తూర్పువైపు శ్లాబ్ వేసి ఆవరణ ను పెంచడం వంటి పనులు పూర్తి చేశారు. రెండో మెట్లదారి నిర్మాణం పనులు పర్యవేక్షిస్తున్నారు. రత్నగిరిపై నూతన సత్రం నిర్మాణం డిజైన్లు కూడా రూపొందిస్తున్నారు.

ఉదయ్ కుమార్ బదిలీ అవడంతో మెట్లదారి నిర్మాణ పనులు, నూతన సత్రం నిర్మాణ పనులు కుంటుపడే అవకాశం ఉంది. అందువలన మరలా డీఈ ఉదయ్‌కుమార్‌ను ఇక్కడ ఇన్‌ఛార్జి డీఈగా నియమించడం లేదా అనుభవజ్ఞుడైన మరో డీఈను నియమించడం కాని చేయాల్సిన అవసరం ఉందని సిబ్బంది అంటున్నారు.

పని గంటలు పెంచడం అన్యాయం



కోటనందూరులో ఆందోళన చేస్తున్న కార్మికులు

కిర్లంపూడి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు కొమ్ముకాసేలా కార్మికుల పనిదినాలు పెంచడం అన్యాయమని సీఐటీయూ నాయకులు ధ్వజమెత్తారు. మంగళవారం మండల కేంద్రం కిర్లంపూడిలో పలు కార్మిక సంఘ నాయకుల సమక్షంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్‌లతో కూడిన వినతపత్రాన్ని తహసీల్దార్ జె.చిరంజీవికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు సీహెచ్ రత్నం, ఎస్.హెలిజబెత్ రాణి, టి.జీవ, ఆర్.ఈశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల కూటమి ప్రభుత్వం కేబినెట్ సమావేశంలో 8 గంటల పని సమయాన్ని 10 గంటలు పెంచి కార్మికులపై మరింత పనిభారం పెంచడం దారుణమన్నారు. సంపద సృష్టికర్తలు, పెట్టుబడి దారులు అని గొప్పలు చేప్పుకునే ప్రభుత్వ పెద్దలు కార్మికుల పని గంటలు పెంచాల్సిన అవసరం ఏముంది..? అని ప్రశ్నించారు. మహిళలకు భద్రత కరువైన నేపథ్యంలో రాత్రిళ్లు మహిళల చేత పనిచేయించడం ఏమిటని నిలదీశారు. ప్రజలపై పన్నులు, నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతున్నప్పుడు కార్మికులకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పని గంటల భారాన్ని తగ్గించకపోతే మరిన్ని ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

రూ.26 వేల వేతనం చెల్లించాలి

కోటనందూరు: ఏ రంగంలో పని చేసే కార్మికులకైనా రూ. 26 వేల వేతనం చెల్లించాలని సీఐటియూ మండల కార్యదర్శి షేక్ పద్మ డిమాండు చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. షేక్ పద్మ మాట్లాడుతూ ప్రభుత్వాలకు కార్మికుల శ్రమను దోచుకోవడం రివాజుగా మారిందని ఆరోపించారు. ఇటీవల రాష్ట్ర క్యాబినేట్ ఆమోదించిన 10 గంటల పని విధానాన్ని ఉసంహరించుకోవాలని డిమాండు చేశారు. పగలే భద్రత లేని మహిళలు రాత్రివేళ ఎలా పని చేస్తారని ప్రశ్నించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకూ ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

పని గంటలు తగ్గించాలి

ప్రత్తిపాడు: రాష్ట్ర క్యాబినేట్ ఆమోదించిన పది గంటల పని విధానాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం కార్మికులు ధర్నా చేపట్టారు. సీఐటీయూ మండల కమిటి ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో పది గంటల పని విధానాన్ని విరమించుకోవాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని నినాదాలు చేశారు. తహసీల్దార్ ఎం సూర్యప్రభకు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహం ధ్వంసం



పెరుమాళ్లపురం పంచాయతీ చింతకాయలపేట రామాలయం వద్ద విచారణ చేస్తున్న పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు



దెబ్బతిన్న ఆంజనేయ స్వామి విగ్రహం

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురంలో చింతకాయలపేటలో రామాలయంలో ఆంజనేయస్వామి విగ్రహన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసిన సంఘటన చర్చనీయంశమైంది. స్థానికులు వివరాల మేరకు చింతకాయలపేట రామాలయంలో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రామాలయంలో ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహాన్ని తొలగించి ఆలయానికి సమీపంలో బయటపడేయడంతో మంగళవారం గ్రామస్తులు గుర్తించారు. రామాలయంలో పలు వస్తువులు కూడా ధ్వంసమయ్యాయి. దీంతో హనుమాన్‌దళ్ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అనంతరం హనుమాన్‌దళ్ సభ్యులు, గ్రామస్తులు కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనకు పాల్పడిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, ఎస్సై బి.జగన్మోహన్‌రావు రామాలయం వద్దకు చేరుకుని జరిగిన సంఘటనపై విచారణ జరిపారు. రామాలయం పరిసరప్రాంతాల్లో సీసీటీవీ ఫుటేజ్ పరిశీలన తదితర ఆధారాలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీడీపీఓ పూర్ణిమ

జగ్గంపేట: జగ్గంపేట నియోజకవర్గం మూడు మండలాలు పరిధిలోని 182 అంగన్వాడీ కేంద్రాల్లో కిశోరి బాలికలకు 12 అంశాలపై వేసవి శిక్షణా శిబిరంలో అవగాహన కల్పించామని ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ తెలిపారు. జగ్గంపేట మండలం రామవరం పంచాయతీ కార్యాలయంలో వేసవి శిక్షణా శిబిరం ముగింపు వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా బాలల సంరక్షణాధికారి వెంకట్రావు విచ్చేశారు. కిశోరి బాలికలకు విద్య, పోషకాహారం, ఋతుస్రావ ఆరోగ్యం, వ్యక్తిగత శుభ్రత, బాలల హక్కులు రక్షణ, పోక్స్ చట్టం, గుడ్‌టచ్ బాడ్ టచ్, రక్తహీనత, నివారణ చర్యలు, బాలికల నాయకత్వం, సాధికారిత, పొదుపు ఆర్థిక నిర్వహణ, తదితర 12 అంశాలపై పూర్తిగా శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. గ్రామాలలో వాటిని అమలుల్లో పెట్టేందుకు బాల్య వివాహాల రహిత గ్రామాలగా మార్చడానికి కృషి చేయాలని గ్రామ పెద్దలు కూడా సహకరించాలని అన్నారు. శిక్షణ తరగతుల అనంతరం నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన బాలికలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, టీడీపీ నేతలు, అంగన్వాడీ టీచర్స్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.